# మానవహక్కుల వేదిక పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్

# ఎలికె రాజేంద్రప్రసాద్ అరెస్టును ఖండించండి

మానవహక్కుల వేదిక పశ్చిమ గోదావరి జిల్లా శాఖ కన్వీనర్ ఎలికె రాజేంద్రప్రసాద్‌ను నకిలీ నక్సలైట్ ముఠా నాయకుడు అని వర్ణిస్తూ ఆ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కృపానంద్ త్రిపాఠి ఉజేలా పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించిన సంగతి అన్ని దినపత్రికలూ అన్ని ఎడిషన్లలోనూ ప్రచురించాయి కాబట్టి రాష్ట్రమంతా ఎరుగును.

దీనికి బదులుగా ఉజేలాగారిని చట్ట వ్యతిరేక ఖాకీ హంతక ముఠానాయకుడు అని మేము నిందించవచ్చును. మాకు ఆ మాత్రం మాటలు చేతకాక కాదు, సాహసం లేక కాదు. కానీ వారి స్థాయికి దిగజారడం మాకు ఇష్టంలేదు. రాజేంద్రప్రసాద్‌పైన పోలీసులు పెట్టిన తప్పుడు కేసులకు సంబంధించిన అసలు వాస్తవాలు ఏమిటో వివరిస్తూ మేము పత్రికలకు ప్రకటనలు ఇచ్చాము.

అక్టోబర్ 29న ఎస్.పి. ఉజేలాగారు ఏలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని రాష్ట్రవ్యాపితంగా ప్రచారం చేసిన దినపత్రికలు, 30వ తేదీన మేము హైదరాబాద్‌లో విడుదల చేసిన ప్రకటనను హైదరాబాద్ ఎడిషన్‌కే పరిమితం చేసి ప్రచురించాయి. ఒకటి రెండు పత్రికలు అసలే ప్రచురించలేదు. ఆ తరువాత మేము నవంబర్ 3వ తేదీన చింతలపూడిలో నిర్వహించిన విలేకరుల సమావేశం వార్తను పత్రికలన్నీ ఆ జిల్లాకే పరిమితం చేశాయి.

అధికారంలో ఉన్నవారు ఒక పౌరుని వ్యక్తిత్వాన్ని భ్రష్టుపట్టించే నింద వేస్తే దానిని పత్రికలు వెనువెంటనే లక్షలాది పాఠకులకు అందజేస్తాయి. ఆ వ్యక్తి లేక అతని సంస్థ దానికి జవాబు చెప్పాలంటే ఒక్కొక్క జిల్లాలోనూ ఒక్కొక్కసారి గొంతు చించుకోవాలి. అప్పటికీ అంతే ప్రముఖంగా వారి గొంతును పత్రికలు ప్రజలకు వినిపింప జేస్తాయన్న భరోసా లేదు. ఇది ఏరకమైన న్యాయమో దినపత్రికల సంపాదకులు ఆలోచిస్తారని ఆశిస్తూ, మాకున్న ఒకే ఒక ప్రత్యామ్నాయం అయిన ఈ కరపత్రాన్ని మీ ముందు ఉంచుతున్నాం. నిజమే, దినపత్రికలకు లక్షల పాఠకులు ఉంటారు. మేము 10 వేల కరపత్రాలు వేయగలిగితే అదే మా స్తోమతకు ఎక్కువ. అయినప్పటికీ మౌనంగా నిందను భరించడం కంటె ఇది ఉచితం అనుకుంటున్నాము.

ఎలికె రాజేంద్రప్రసాద్ నకిలీ నక్సలైట్ ముఠానాయకుడు కాదు, మరే ముఠానాయకుడూ కాదు. అతను న్యాయవాది, విద్యార్థి దశనుంచి అభ్యుదయ రాజకీయాలలో చురుగ్గా పనిచేసిన ప్రజాస్వామికవాది. అతను నివసించేది, న్యాయవాద వృత్తి నిర్వహించేది, మానవహక్కుల వేదిక జిల్లా శాఖ కన్వీనర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాలో మా సంస్థ కార్యకలాపాలను నడిపేది చింతలపూడిలో. చింతలపూడి పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలోని ఒక మారుమూల నియోజకవర్గం. దానిని ఆనుకొని ఖమ్మం జిల్లాలోని మారుమూల నియోజకవర్గమైన సత్తుపల్లి ఉంది. ఈ రెండు నియోజకవర్గాలూ ఆదివాసులు పెద్ద సంఖ్యలో నివసించే వెనుకబడిన ప్రాంతాలు. అయితే ఈ రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వంలో చాలా ప్రాబల్యం ఉన్న మంత్రులు. వారినీ, వారి అనుచర గణాన్నీ, వారి అడుగులకు మడుగులొత్తే అధికార గణాన్నీ ఎదిరించే సాహసం అక్కడ ఎవరూ చేయరు.

అందుకు మినహాయింపుగా ఉండడం ఎలికె రాజేంద్రప్రసాద్ చేసిన ఏకైక నేరం. నీతిమాలిన అధికార యంత్రాంగం దీనికి ప్రతీకారంగా రాజేంద్రప్రసాద్ పైన అతి నీచమైన అభియోగం మోపి పత్రికలకెక్కి రాష్ట్రమంతటా దానిని ప్రచారం చేసింది.

రాజేంద్రప్రసాద్‌ను 28 అక్టోబర్ అర్ధరాత్రి అరెస్టు చేయడానికి దారితీసిన ఘటనలు చూస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది. చింతలపూడికి సమీపంలోని టి.నర్సాపూర్ మండలం అల్లంచెర్ల గ్రామానికి చెందిన మరుగుదొడ్ల సావిత్రి అనే దళిత స్త్రీ, తనను కొందరు వ్యక్తులు వేధిస్తున్నారని టి.నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపైన టి.నర్సాపూర్ ఎస్.ఐ. ఎటువంటి చర్య తీసుకోకపోయేసరికి ఆమె రాజేంద్రప్రసాద్‌ను కలిసి సహాయం కోరింది. అతని సలహామేరకు ప్రతీ శనివారం చింతలపూడి మేజిస్ట్రేటు నిర్వహించే లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేసింది.

ఇది జరిగి కొంతకాలం అయింది. చింతలపూడి కోర్టు నుంచి తాఖీదు ఏమైనా అందిందేమో, టి.నర్సాపూర్ ఎస్.ఐ. సావిత్రిని అక్టోబర్ 26 నాడు (శనివారం) స్టేషన్‌కు రమ్మన్నాడు. తనపైన కోర్టులో ఫిర్యాదు చేసినందుకు కక్షకొద్దీ ఆమెను విపరీతంగా దూషించాడు, కొట్టాడు. ఈ సంగతి ఆమె మళ్లీ ఎలికె రాజేంద్రప్రసాద్‌కు చెప్పగా, అతను ఆమెచేత పత్రికల వారితో మాట్లాడించి, మళ్లీ చింతలపూడి మేజిస్ట్రేటుకు ఫిర్యాదు ఇప్పించాడు. ఇది జరిగింది అక్టోబర్ 28 సాయంత్రం. ఈ సందర్భంగా 'ఈనాడు' దినపత్రికలో వచ్చిన వార్తను దిగువ యథాతథంగా ఇస్తున్నాం.

అక్టోబర్ 28 సాయంత్రం 4.00 గంటలకు, 4.30 గంటలకు రాజేంద్రప్రసాద్ పైన టి.నర్సాపూర్, చింతలపూడి పోలీస్‌స్టేషన్లలో రెండు కేసులు బుక్ అయ్యాయి. అంటే సావిత్రి తనపైన జరిగిన దౌర్జన్యాన్ని గురించి రాజేంద్రప్రసాద్‌కు చెప్పిందనీ, అతను ఆమెకు ఫిర్యాదు రాసిచ్చి మేజిస్ట్రేటు దగ్గరకు పంపుతున్నాడనీ తెలిసి ఈ రెండు కేసులూ అతనిపైన పోలీసులు బుక్ చేశారు. ఇవి కక్షసాధింపు కోసం కల్పించిన కేసులని వాటిని నమోదుచేసిన సందర్భమే చెప్తుంది.

ఒకటి ఎప్పుడో అస్పష్టమైన గతంలో రాజేంద్రప్రసాద్ తాను నక్సలైటునని చెప్పి బెదిరించి ఒకరి దగ్గర 15,000 రూపాయలు వసూలు చేసుకున్నాడన్న అభియోగంతో నమోదయిన కేసు. రెండవది, 'సుమారు 20 రోజుల క్రితం' నక్సలైటునని చెప్పి, నీ భూమిలోకి గిరిజనులను దింపుతానని చెప్పి, ఒక

గిరిజనేతర రైతు దగ్గర రాజేంద్రప్రసాద్ 20,000 రూపాయలు బలవంతంగా వసూలు చేసుకున్నాడన్న అభియోగంతో నమోదయిన కేసు. స్పష్టమైన తేదీ కూడ తెలీని పాత ఘటనలపైన ఆ సాయంత్రమే ఫిర్యాదు ఇవ్వాలని ఆ 'బాధితు'లిద్దరికీ ఎందుకు అనిపిస్తుందన్న అనుమానం ఎవరికైనా రావాలి.

దళిత స్త్రీ సావిత్రిని టి.నర్సాపూర్ ఎస్.ఐ. కొట్టి, అవమానపరచిన వైనాన్ని కోర్టు దృష్టికి తీసుకుపోయిన పాపానికి రాజేంద్రప్రసాద్‌పైన ఈ తప్పుడు కేసులు నమోదుచేసిన చింతలపూడి, టి.నర్సాపూర్ ఎస్.ఐ.లు 28 అర్ధరాత్రి చింతలపూడి సి.ఐ.తో కలిసి రాజేంద్రప్రసాద్ ఇంటిపైన దాడిచేశారు. తలుపులు విరగ్గొట్టి అయినా సరే అతనిని పట్టుకుపోతామంటూ నానా హంగామా చేశారు. రోజూ కోర్టులో ప్రాక్టీస్ చేసే అడ్వకేట్‌ను అర్ధరాత్రి అరెస్టు చేయవలసిన అవసరం ఏముందంటే 'మాకు పైనుంచి ఆదేశాలున్నాయి' అంటాడు చింతలపూడి ఎస్.ఐ. 'అరెస్టు చేయడానికి వారంట్ ఉందా?' అని అడిగితే ఇది సినిమా కాదు అని జవాబు చెప్తాడు. అరెస్టు చేయడానికి వారంట్ ఉండి తీరాలన్నది సినిమాల వల్ల వ్యాపించిన అభిప్రాయమే కావచ్చును గానీ, పోలీసులాడిన అర్ధరాత్రి డ్రామా ప్రజలకు సినిమాను తలపింపజేస్తే ఆ తప్పెవరిది?

ఈ విధంగా వీరోచితంగా అరెస్టుచేసిన ఎలికె రాజేంద్రప్రసాద్‌ను అప్పటికే వారంపైగా పోలీసుల కస్టడీలో ఉన్న మరొక 12 మంది యువకులతో కలిపి వాళ్లంతా డబ్బులు దండుకునే నకిలీ నక్సలైట్లు అనీ, రాజేంద్రప్రసాద్ వారి నాయకుడనీ కథ అల్లి జిల్లా ఎస్.పి. కృపానంద్ త్రిపాఠి ఉజేలా 29నాడు పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి ప్రకటించాడు.

రాజేంద్రప్రసాద్ నకిలీ నక్సలైట్ ముఠా నాయకుడనడం ఎంత అబద్ధమో, ఆ 12 మందీ నకిలీ నక్సలైట్లనడమూ అంతే అబద్ధం. వాళ్లలో నలుగురు మాత్రమే ఆ బిరుదుకు అర్హులు. మిగిలిన వాళ్లలో రైతుకూలీ సంఘం కార్యకర్తలు, ప్రజాపార్టీ కార్యకర్తలు, న్యూ డెమోక్రసీ కార్యకర్తలు ఉన్నారు. వీళ్లంతా అప్పటికే కొన్ని రోజులుగా పోలీసుల అదుపులో ఉన్నారు. వారిని కోర్టులో హాజరుపరచాలని ఆయా సంస్థలు డిమాండ్ చేసి ఉన్నాయి. మానవహక్కుల వేదిక ప్రతినిధిగా రాజేంద్రప్రసాద్ కూడా వారిని కోర్టులో హాజరుపెట్టాలని ప్రకటన ఇచ్చి ఉన్నాడు. జిల్లా పౌరహక్కుల సంఘం బాధ్యులు కూడా ప్రకటనలు ఇచ్చి ఉన్నారు.

వీరందరినీ నకిలీ నక్సలైట్లు అనీ, రాజేంద్రప్రసాద్‌ను వాళ్ల నాయకుడనీ అనడం వల్ల వారిపట్ల ప్రజలలో సానుభూతి లేకుండ చేయడం ఎస్.పి. ఉజేలాగారి దిక్కుమాలిన తెలివితేటలనుకోవాలి. బహుశా తాను చాలా గొప్పపని చేశానని ఆయన అనుకుంటూ ఉండాలి. పత్రికలు ఆయన ప్రకటనను రాష్ట్రమంతటా ప్రచారం చేయడమేకాక దానికి 'ఫాలోఅప్'గా 'రాజమండ్రి జైలుకు నకిలీ నక్సలైట్లు' అని ఒకరోజు, 'నకిలీ నక్సలైట్ల ఆటకట్టు' అని రెండవ రోజు వార్తలు ప్రచురించాయి. అరెస్టయిన వ్యక్తులు ఎవరు, వారి పూర్వాపరాలు ఏమిటి అని ఆ మాత్రం తెలుసుకొని సొంత గొంతుతో రాయడం పత్రికలకు సాధ్యం కాదనుకోవాలా? ఒక అధికారి ఒక కల్పన చేయగానే ఆ కల్పన చుట్టూ వార్తలు అల్లడమే పత్రికల కర్తవ్యమా? పత్రికా రంగం కొంచెం ఆత్మపరీక్ష చేసుకుంటుందని ఆశిస్తాం.

మా మాటకొస్తే తప్పులు కేసులూ, తప్పుడు అభియోగాలూ హక్కుల ఉద్యమానికి కొత్త కాదు. ఒకప్పుడు నక్సలైట్ అన్న ముద్రవేసి అణచాలని చూశారు. ఇప్పుడు నకిలీ అన్న విశేషణం తగిలించి భ్రష్టుపట్టించేశానని కృపానంద్ త్రిపాఠి ఉజేలాగారు సంతోషిస్తుండవచ్చు. అయితే ఈ ప్రయత్నాల వల్ల చట్టాన్నీ, అధికారాన్నీ దుర్వినియోగం చేసే వ్యక్తులుగా ఆయనవంటి అధికారులు భ్రష్టుపట్టారే తప్ప, మమ్మల్ని భ్రష్టుపట్టించడం వారి తరం కాదు. తాత్కాలికంగా ఒక దురభిప్రాయం కలిగించినా మా ఆచరణే మా వ్యక్తిత్వం ఏమిటో ప్రజలకు రుజువు చేసి చూపిస్తుంది.

8.11.2002

**– మానవహక్కుల వేదిక**

**(HRF)**

## మహిళలను అర్ధనగ్నంగా నిలబెట్టిన ఎస్.ఐ.

చింతలపూడి, అక్టోబర్ 28 (న్యూస్‌టుడే): రక్షణ కోరుతూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఒక దళిత మహిళకు తీరని పరాభవం ఎదురయిన సంఘటన టి.నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. రక్షణ కల్పించాల్సిన ఎస్.ఐ. తనపట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాక తనను అర్ధనగ్నంగా స్టేషన్‌లో నిలబెట్టారంటూ ఆ మహిళ రోదిస్తోంది. న్యాయవాది, మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనర్ ఎలికె రాజేంద్రప్రసాద్ సహాయంతో సోమవారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది. గంగాధరరావు, దావీదు అనే ఇద్దరు వ్యక్తులు తనను కొంతకాలంగా వేధిస్తున్నట్టు గతంలో తాను చేసిన ఫిర్యాదును పోలీసులు పట్టించు కోలేదనీ, పైగా వారి ప్రోద్బలంతో టి.నర్సా పూర్ ఎస్.ఐ. తాతారావు శనివారం ఉదయం పది గంటలకు తనను స్టేషన్‌కు పిలిపించి అసభ్యంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆరోజు సాయంత్రం వరకు తనను అర్ధనగ్నంగా నిలబెట్టి అవహేళన చేశారని ఆమె ఆరోపించారు. టి.నర్సాపురం అల్లంచెర్ల కొత్తగూడెంకు చెందిన బాధితురాలు, ఎస్.ఐ. తాతారావుతో పాటు చొప్పా గంగాధరరావు అనే ఆర్ఎంపి డాక్టర్‌ను, తారంకి దావీదు అనే మరో వ్యక్తిని తన ఫిర్యాదులో ముద్దాయిలుగా పేర్కొంది. తనను కులం పేరుతో దూషించి తీవ్రంగా కొట్టడంతో ఒళ్లంతా కమిలిపోయిందని రోదిస్తూ శరీరంపైన ఉన్న గాయాలను కోర్టులో చూపించింది. నిందితుల నుంచి, ఎస్.ఐ. నుంచి తనకు రక్షణ కల్పించి న్యాయం చేయవలసిందిగా మేజిస్ట్రేట్‌ను అభ్యర్థించింది. దీనిపై మేజిస్ట్రేట్ ఎన్.రాజ్ కుమార్ స్పందించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాల్సిందిగా పోలీసులను ఆదేశించారు.